రైతు భరోసా ఎప్పుడిస్తారో?



ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తోంది. ఇప్పటి వరకు రైతు భరోసా ఇవ్వలేదు. ఏటా పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజలంతా నమ్మి ఓట్లేసారు. ఎక్కడా రైతు భరోసా ఈ ప్రస్తావన లేదు. జగనన్న ప్రభుత్వంలో మే నెలలోనే రైతుల ఖాతాల్లో జమ చేశారు.

– గొర్ల గోవిందు, రైతు, సీతంపాలెం(నక్కపల్లి)

ఇంటికో ఉద్యోగమేదీ?



నేను ఇంజినీరింగ్‌చదివి ఖాళీగా ఉంటున్నాను. 2014లో కూడా ఇలాగే నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వలేదు. ఈ దఫా అధికారంలోకి వస్తే ఏటా 4లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. అప్పటివరకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఈ హామీ నమ్మి అందరూ ఓట్లేశారు. ప్రస్తుతం దీనిపై స్పష్టమైన ప్రకటన లేదు. ఎప్పటినుంచి ఇస్తారో చెప్పడం లేదు. చాలా దారుణం.

–రాజ్‌కుమార్, నిరుద్యోగి(నక్కపల్లి)

రూ.20వేలు ఎప్పుడు ఇస్తారు?



ఎన్నికల్లో రైతులకు పంట సహాయంగా సంవత్సరానికి రూ. 20వేలు ఇస్తానని ప్రకటించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రైతులకు ఎటువంటి సాయం అందించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఏటా ఖరీఫ్ సమయంలో రైతుల ఖాతాల్లోకి నగదు వేసి రైతు పక్షాన నిలబడిన ప్రభుత్వంగా నిలిచిపోయింది. అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయానికి రూ.20వేలు పంట సాయం వస్తుందని ఆశించిన రైతులకు ఈ ఏడాది ఎప్పుడు వస్తోందో ? అని నిరాశలో ఉన్నారు. పంట సాయానికి సంబంధించి ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో పథకం అమలు కాదేమో అనే సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు.

–రేఖా నందగోపాల్, హరిపురం గ్రామం

భృతి కోసం ఎదురు చూస్తున్నా..



చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీల్లో నిరుద్యోగ భృతిగాని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారు. ఇంతవరకు ఏమీ అమలు చేయలేదు. నేను వైఎస్సార్‌సీపీ హయాంలో ఏఎంఓగా పని చేసి నెలకు 25 వేల రూపాయల జీతం వచ్చేది. ప్రస్తుతం ఉద్యోగం లేదు, నిరుద్యోగ భృతి లేదు. చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలి.


– దాడి సురేష్, బీటెక్, పాయకరావుపేట

రైతును ముంచుతారా?



కూటమి ప్రభుత్వం వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు వేస్తామన్నారు. ఇప్పటికీ దాని ఊసేలేదు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకుండానే రైతు భరోసా నగదు వేసేవారు. పెట్టుబడిలేక అప్పులు చేసి ఖరీఫ్ వరినాట్లు వేశాం. పైరు ఎదుగుతోంది. ఎరువులు, కలుపుతీత వంటి పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే తెచ్చిన అప్పులతో సతమతమవుతున్నాం. కొత్తగా మళ్లీ అప్పులు తేవాలంటే ఎవరూ ఇచ్చే పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.20 వేలు వేసి రైతులను ఆదుకోవాలి.

– లోకావరపు బాబులు, రైతు, పి.కె.పల్లి, కోటవురట్ల మండలం



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

''అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరూ... వాడా ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సహాయం అన్నదాతా సుఖీభవ పథకం కింద అందజేస్తాం.. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ. 15 వేలు తల్లికి వందనం పేరిట ఇస్తాం... ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం... నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తాం.. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500 చొప్పున అకౌంట్లో జమ చేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని.. ఇలా తమ మేనిఫెస్టోలో చేర్చి భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. ఖరీఫ్ సాగు ప్రారంభమై నెలలు గడుస్తోంది. అయినా రైతులకు సాయం అందలేదు. ఇలా చెప్పిన ప్రతి పథకానికీ ఇంత వరకూ అతీ గతీ లేదు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పక్కాగా పథకాలన్నీ అమలు చేసింది. దీంతో ప్రజలు గత ప్రభుత్వం ఇచ్చినట్లుగానే కచ్చితంగా హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

– సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్

ప్రతి మహిళలకు నెలకు రూ.1500



నియోజకవర్గం	అర్హులు	లబ్ధి(రూ.కోట్లలో)
పాయకరావుపేట	1,02,135	15.3
యలమంచిలి	67,608	10.14

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి



నియోజకవర్గం	అర్హులు	లబ్ధి(రూ.కోట్లు)
పాయకరావుపేట	91,895	27.54
యలమంచిలి	77,952	23.38

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం




నియోజకవర్గం	లబ్ధిదారులు
పాయకరావుపేట	1,43,533
యలమంచిలి	1,60,000

జగన్ పాలనలో రైతు భరోసా కింద రైతుకు అందిన సాయం

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
యలమంచిలి	34,907	230.33
పాయకరావుపేట	41,240	265.00

ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతుకు అందాల్సిన సాయం

నియోజకవర్గం	అర్హులు	లబ్ధి(రూ.కోట్లలో)
యలమంచిలి	34,907	69.81
పాయకరావుపేట	41,240	82.48

ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు



పాయకరావుపేట నియోజకవర్గం	
లబ్ధిదారులు	91,895
ఇవ్వాల్సిన సిలిండర్లు	2,75,685
లబ్ధి	22.35 (రూ.కోట్లు)
యలమంచిలి నియోజకవర్గం	
లబ్ధిదారులు	77,952
ఇవ్వాల్సిన సిలిండర్లు	2,33,856
లబ్ధి	18.96 (రూ.కోట్లు)

జగన్ పాలనలో ఏడాదికి అమ్మ ఒడి సాయం

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
యలమంచిలి	93,944	140.91
పాయకరావుపేట	33,500	45.22

ప్రతి తల్లికి రూ.15 వేలు తల్లికి వందనం



టీడీపీ పాలనలో ఏడాదికి అందాల్సిన తల్లికి వందనం సాయం

నియోజకవర్గం	అర్హులు	లబ్ధి(రూ.కోట్లలో)
యలమంచిలి	98,500	147.75
పాయకరావుపేట	44,670	97.00

భృతి లేదా ఉద్యోగం ఇవ్వండి



నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు,పవన్‌కల్యాణ్ ఇద్దరూ కూడా చాలా గట్టిగా హామీ ఇచ్చారు. అది నమ్మి నిరుద్యోగులంతా కూటమికి ఓట్లేశారు. నేను బీఎస్సీ బీఈడీ చేశా. ఏ ఉపాధి లేక ఇంట్లో కూర్చున్నాం. మీరు ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిరుద్యోగ భృతి వేయండి. లేదా ఏదైనా ఉద్యోగమైనా కల్పించండి. నిరుద్యోగులంతా ఉద్యోగం కలిస్తారని, లేదంటే నిరుద్యోగ భృతి అయినా వేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ మీరంతా ఒక్కొక్కరూ ఒక్కో రకంగా చెబుతున్నారు. అసలు ఇస్తారా ఇవ్వరా. లేదంటే ఆఖరి సంవత్సరంలో ఇస్తారా? ఏదో ఒకటి క్లారిటీ ఇవ్వండి.

– కె.వెంకటకృష్ణ, నిరుద్యోగి, పి.కె.పల్లి, కోటవురట్ల మండలం

తల్లికి వందనం ఎప్పుడో?



తల్లికి వందనం డబ్బులు ఎపుడు వేస్తారో తెలియడం లేదు. నాకు ఇద్దరు పిల్లలు. బాబు 3వ తరగతి, పాప 2వ తరగతి చదువుతున్నారు. వారి ఫీజులు గురించి పాఠశాలల యాజమాన్యం ఒత్తిడి తెస్తోంది. గత ప్రభుత్వంలో ఒక్కరికైనా ఈపాటికే వేసేవారు. కూటమి నాయకులు ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి డబ్బులు వేస్తామన్నారు. నాకు ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు వస్తాయి. నాలా చాలా మంది ఎదురు చూస్తున్నారు.

– పత్తి ఆదిలక్ష్మి, పి.కె.పల్లి, కోటవురట్ల మండలం

గ్యాస్ సిలిండర్ల కోసం చూస్తున్నాం



చంద్రబాబు గెలిస్తే మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. గెలిచి 100 రోజులు కావస్తున్నా ఇంకా గ్యాస్ సిలిండర్లు ఇవ్వలేదు. మూడు సిలిండర్లు వస్తే ఆర్థికంగా కాస్త ఇబ్బంది ఉండదు. అందుకే కూటమికి ఓటేశాం. ప్రస్తుతం డబ్బులు ఇచ్చి కొనుక్కుంటున్నాం. చాలా ఇబ్బంది పడుతున్నాం. తొందరగా గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని కోరుతున్నాం

– ఎల్.వెంకటరాజ్యలక్ష్మి, పి.కె.పల్లి, కోటవురట్ల మండలం

గతంలో వలే మోసం చేస్తారా?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరోద్యోగ భృతి ఇస్తామన్నారు. 2014లో కూడా ఇలాగే హామీ ఇచ్చారు. అప్పుడు నెరవేర్చలేదు. 2024లో కూడా అదే హామీ ఇచ్చారు. నెలకు రూ.3వేలు ఇస్తామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతోంది. నిరుద్యోగ భృతి ఎప్పటినుంచి ఇస్తారో ప్రకటించడం లేదు. ఉద్యోగాలు భర్తీ చేయలేదు. భృతి ఇవ్వలేదు. చాలా దారుణం.

– సాయితేజ్, పాయకరావుపేట

ఆడబిడ్డ నిధి ఎక్కడ?



సూపర్‌సిక్స్ పదకాల్లో భాగంగా ఆడబిడ్డ నిధి కింద నెలకు మహిళలకు రూ.1500 ఇస్తామన్నారు. మహిళలంతా నమ్మి ఓట్లేసారు. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఎప్పటి నుంచి ఇస్తారోకూడా తెలియడంలేదు. అసలు ఇస్తారా ఇవ్వరా, గెలిచి వందరోజులు కావస్తోంది.

– గంటావాణి, చందనాడ

ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన

కోటవురట్ల: లింగాపురంలో పతంజలి కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆయిల్‌పామ్ రైతులకు యాజమాన్య పద్ధతులు, దిగుబడిని పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కంపెనీ సీనియర్ మేనేజర్ తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కె.రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.అజయ్, ఉద్యానవన శాఖ, ఏపీఎంఐపీ, పతంజలి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'సాహసం' ప్రోత్సాహకాలు

కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు సాహసం స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమని ఎంఈవో రామారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో జరిగే ప్రతిభా పోటీల నిర్వహణపై బుధవారం అవగాహన కల్పించారు. సంస్థ రాష్ట్ర ప్రతినిధి దీపక్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఐదు జిల్లాల్లో ప్రతిభా పోటీలు నిర్వహించి ఎంపికైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. పాఠశాలలో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేయనున్నామన్నారు.

పూడిమడక చేరుకున్న 'రక్షణ యాత్ర'

అచ్యుతాపురం(మునగపాక): ఫార్మా కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులకు రక్షణతో పాటు భద్రత కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రక్షణ యాత్ర బుధవారం పూడిమడకకు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కోటేశ్వరరావు, రాములు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో ఎక్కడో ఒక చోట నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ నెల 20న అచ్యుతాపురం జంక్షన్‌లో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7331100207, 7997958344

యాజమాన్య పద్ధతులతో మెరుగైన దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాదరావు

మునగపాక: సమగ్ర యాజమాన్య పద్ధతులతో వ్యవసాయంలో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాదరావు అన్నారు. మండలంలోని చూచుకొండలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం హరిపురం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మ, స్థూల పోషకాల లోపాల వల్ల పంటల్లో దిగుబడులు తగ్గిపోతాయన్నారు. శాస్త్రవేత్త శ్రీహరిరావు మాట్లాడుతూ మోతాదుకు మించి ఎరువులను వినియోగించరాదన్నారు. జీవామృతం వినియోగంతో మొక్కలకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. చీడపీడల నివారణకు సంబంధించి శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీసీటీ ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ పవన్‌కుమార్, పీఏ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఆధునిక బోధనపై అవగాహన అవసరం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

నక్కపల్లి: ఆధునిక విద్యా బోధనపై ఉపాధ్యాయులకు అవగాహన అవసరమని జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు అన్నారు. బుధవారం ఆయన మండలంలో వేంపాడు, చినదొడ్డిగల్లు ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన సబ్జెక్ట్ స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి బోధనోపకరణాల ద్వారా బోధన చేయాలన్నారు. వేంపాడు పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని డిప్యూటీ డీఈవో తనిఖీ చేసి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో గొడిచర్ల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నక్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన చిత్ర లేఖన పోటీల(టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు) ఫలితాల్లో గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 10వ తరగతి చదువుతున్న అంగిరెడ్డి నిఖిల్‌సాయిసుధ, 9వ తరగతి చదువుతున్న గిడుతూరి గౌతమ్‌బాలాజీ, జి.వి.మోహన్‌కృష్ణ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేసిన ఆర్ట్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు నాగార్జునను హెచ్‌ఎం అప్పారావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

ఎస్.రాయవరం: లింగరాజుపాలెం జ్యోతిరావుపూలే పాఠశాలలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ప్రముఖ కంటి వైద్య నిపుణుడు వెంకటరావు పరీక్షలు చేశారు. కంటి సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

మునగపాక: అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రజా పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీల విషయంలో నిర్లక్ష్యం సరికాదన్నారు.

నేడు అమ్మవార్ల పండగలు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గ్రామ దేవతల పండగలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మునగపాకలో దుర్గాలమ్మ తల్లి, మూలపేటలో గంగాలమ్మతల్లి పండగలు జరగనున్నాయి. భక్తులు తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకోవాలని ఆయా కమిటీల సభ్యులు కోరారు.

20, 21 తేదీల్లో మండల స్థాయి క్రీడలు

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో ఈ నెల 20, 21 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు ప్రధానోపాధ్యాయుడు ఎస్.సత్యనారాయణ తెలిపారు. కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో మండలంలోని పలు పాఠశాలల పీడీలు, పీఈటీలు సమావేశమయ్యారు. అండర్ 14, 17 బాలుర విభాగంలో పోటీలు, ఎంపికలు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 94941 52090, 99597 85202లలో సంప్రదించవచ్చన్నారు.

ప్రశస్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

నక్కపల్లి: దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రశస్త యాప్‌ను ఉపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయిని యాస్మిన్ కోరారు. గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. దివ్యాంగులను గుర్తించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం పూడిమడకలో నాటుసారా విక్రయిస్తున్న మహిళను బుధవారం అరెస్ట్ చేశారు. గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు అచ్యుతాపురం పోలీసులు దాడి చేశారు. 10 లీటర్ల నాటుసారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ గణేష్ తెలిపారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు పీడీ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణకు కోర్టులను సిద్ధం చేశామన్నారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీలలో మండల స్థాయిలో గెలుపొందిన వారు జిల్లా స్థాయిలో ఆడేందుకు అర్హత సాధిస్తారని తెలిపారు.

హిందీ భాషపై మక్కువ పెంచాలి

మునగపాక: హిందీ భాషపై ఆసక్తి పెరిగేలా బోధన ఉండాలని ఎంఈవో వేణుగోపాలరావు కోరారు. నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం హిందీ స్కూల్ కాంప్లెక్స్ శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీలో పట్టు సాధించేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎంఈవో-2 శివ నాయుడు, హెచ్‌ఎంలు గాలి అప్పారావు, శంకరరావు పాల్గొన్నారు.

ధర్మవరం అగ్రహారం పాఠశాలలో తనిఖీలు

ఎస్.రాయవరం: పాఠశాల ప్రాంగణంలో కూరగాయల పెంపకం అభినందనీయమని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. ధర్మవరం అగ్రహారం పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో పండిన కూరగాయలను శుక్ర, శనివారాల్లో వండే వంటకాల్లో ఉపయోగిస్తున్నామని ఉపాధ్యాయులు వివరించారు. దీంతో ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన సిబ్బందిని అప్పారావు అభినందించారు.

మాజీ సర్పంచ్ రమణ మృతికి సంతాపం



రమణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చిక్కాల తదితరులు

ఎస్.రాయవరం: రేవుపోలవరం వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ చోడిపల్లి రమణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పార్టీకి తీరని లోటని పాయకరావుపేట, నక్కపల్లి మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు చిక్కాల రామారావు, శీరం నరసింహమూర్తి అన్నారు. ఈ మేరకు మృతుడు రమణ కుటుంభ సభ్యులను బుధవారం రేవుపోలవరంలో వారు పరామర్శించి, సంతాపం తెలిపారు. పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పలు గ్రామాల సర్పంచ్‌లు చేపల నాగమణి, తాతాజీ, స్థానిక నాయకులు చోడిపల్లి గోవిందు, గనగళ్ల రాజేష్, అప్పలరాజు, రమణ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: పి.ధర్మవరం కాంప్లెక్స్ పరిధిలో బుధవారం ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తే అవార్డులు వాటంతట అవే వస్తాయన్నారు. ఉప్పరాపల్లి పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు కె.సంపత్, రేవుపోలవరం పాఠశాల హెచ్‌ఎం బి.శారదాను సత్కరించారు.

25న చెకుముకి పోటీలు

అచ్యుతాపురం(మునగపాక): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఎంఈవో దేవరాయల్ తెలిపారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం స్కూల్ కాంప్లెక్స్‌లో బుధవారం చెకుముకి ప్రతిభా పరీక్ష పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఈ నెల 25న, మండల స్థాయిలో వచ్చేనెల 1న, జిల్లా స్థాయిలో 27న, రాష్ట్ర స్థాయిలో నవంబర్ 9, 10 తేదీల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ శ్రీపాద రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకటప్పారావు, యూటీఎఫ్ మండల అధ్యక్షులు మద్దెల నానాజీ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్ : 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com